క్లుప్తంగా

మాచరలో ఫీవర్ సర్వే

కపిలేశ్వరపురం: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాకతిప్ప పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం మాచర గ్రామంలో ఫీవర్ సర్వే చేశారు. వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి జ్వరాలపై సర్వే చేశారు. గ్రామంలో 504 ఇళ్ల పరిధిలో 2,425 మంది ఉన్నారు. ఎనిమిది మంది సాధారణ జ్వరాలతోనూ, నలుగురు డెంగీ అనుమానిత జ్వర లక్షణాలతోనూ బాధపడుతున్నట్టు తెలినట్టు పీహెచ్‌సీ సిబ్బంది తెలిపారు.

చినకోరుమిల్లిలో రామాలయ పునఃప్రారంభ పూజలు

కపిలేశ్వరపురం: కోరుమిల్లి గ్రామ శివారు చిన కోరుమిల్లిలో పునఃనిర్మించిన సీతారామచంద్ర స్వామి ఆలయ ప్రతిష్ఠ పూజలు శనివారం ప్రారంభమయ్యాయి. మార్చి 1న విగ్రహ ప్రతిష్ఠ చేయనున్న నేపథ్యంలో ప్రారంభమైన పూజల్లో పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు. స్వామివారిని మంగళ వాయిద్యాలు, బాణాసంచా కాల్పులతో వైభవంగా ఊరేగించారు. గ్రామానికి చెందిన గంగుమళ్ళ ఉమామహేశ్వరరావు, మాకా వీర వెంకట సత్యనారాయణ మూర్తి, ఐ.పోలవరం మండలం గుత్తినదీవి గ్రామానికి చెందిన కొండమూరి దుర్గారావులు సతీ సమేతంగా పీటలపై కూర్చుని పూజా క్రతువులను చేశారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ఘనంగా సహస్ర దీపాలంకరణ సేవ



సహస్ర దీపాలంకరణ సేవలో బులిస్వామిరెడ్డి, బాపిరెడ్డి తదితరులు

మండపేట: అర్తమూరులోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం సహస్ర దీపాలంకరణ సేవ ఘనంగా జరిగింది. శ్రీవారి ధర్మకర్తల మండలి చైర్మన్ సత్తి బులిస్వామిరెడ్డి ఆధ్వర్యంలో పారిశ్రామికవేత్త కర్రి బాపిరెడ్డి, మహాలక్ష్మి దంపతులు సహస్ర దీపాలంకరణ సేవను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి నిర్వహించిన సుదర్శన హోమం, సామూహిక కుంకుమార్చన, లక్ష తులసి పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కోస్తా ఆంధ్ర రెడ్డి అసోసియేషన్ అధ్యక్షుడు కర్రి త్రినాథరెడ్డి, రెడ్డి సంఘం నాయకులు కొవ్వూరి వీర్రెడ్డి, కర్రి వీర్రెడ్డి తదితరులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. వేడుకల్లో భాగంగా రాత్రికి చోరోత్సవం నిర్వహించారు. ఉద్దగిరి ఆంజనేయులు, వెలగల శివారెడ్డి, కోనాల సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమయానుకూలంగా పొటాష్ వాడాలి

కాజులూరు: వరి పంటపై పొటాష్ ఎరువును రైతులు సమయానుకూలంగా వినియోగించాలని మండల వ్యవసాయాధికారి విశోక్ అన్నారు. శనివారం మండలంలోని గొల్లపాలెంలో ఆయన రైతులతో మాట్లాడుతూ పంట దమ్ములో మొదటి దఫాగా 25 కేజీల పొటాష్ ఎరువును విధిగా వేయాల్సి ఉందన్నారు. రెండో దఫాగా వరిమొక్క చిరు పొట్ట దశలో మరో 25 కేజీలు పొటాష్ ఎరువును వేసినట్లయితే ఓ మోస్తరు తేలికపాటి గాలులకు పంట పడిపోకుండా ఉండి అధిక దిగుబడులకు అవకాశం ఉంటుందన్నారు. మండల గ్రామాల్లో అత్యధిక స్థాయిలో వరి పంట ప్రస్తుతం చిరుపొట్ట దశలో ఉందన్నారు. వ్యవసాయ సేద్యంలో రైతులు ఎరువుల యాజమాన్య పద్ధతులను సక్రమంగా నిర్వహించినప్పుడే పైరు ఆరోగ్యంగా పెరిగి ఆశించిన దిగుబడులు సాధించగలుగుతారన్నారు.

ఎలుకల మందును సద్వినియోగం చేసుకోవాలి



కోలంకలో రైతులతో ఎలుకల మందును తయారు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

కాజులూరు: మండల గ్రామాల్లో జరుగుతున్న ఉచిత బ్రోమోడయోలిన్ మందు పంపిణీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న బ్రోమోడయోలిన్ మందు పంపిణీని ఏఓ పరిశీలించారు. కోలంకలో ఆయన మాట్లాడుతూ మండల గ్రామాల్లో ప్రస్తుతం వరి పంటపై ఎలుకల బెడద ఎక్కువగా ఉందన్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఎలుకల నివారణకు బ్రోమోడయోలిన్ మందును ఉచితంగా సరఫరా చేస్తుందన్నారు. మండలానికి 88 కేజీల మందు విడుదలవగా దాదాపు పంపిణీ పూర్తి కావచ్చిందన్నారు. పంపిణీ సమయంలోనే ఆర్‌బీకే సిబ్బంది ఎరను తయారు చేసుకునే విధానంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారని రైతులందరూ ఒకేమారు సామూహిక ఎలుకల నివారణ చేపటి ఎలుకల నిర్మూలన సాధించాలన్నారు.

మెర్నిపాడు .. అభివృద్ధి జోరు

- రెండేళ్లలో రూ.కోటి వ్యయంతో పలు అభివృద్ధి పనులు
- దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం



ఇందిరమ్మ కాలనీలో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రైన్లు



గ్రామం వెలుపల గల పుంతరోడ్డు (ఫైల్)

మండపేట: మండలంలోని మెర్నిపాడు నియోజకవర్గంలోనే అతి చిన్న పంచాయతీ. నియోజకవర్గానికి శివారున ఉండే ఈ గ్రామం గతంలో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండేది. ప్రభుత్వం మారింది. పాలన మారింది. రెండేళ్లలో దాదాపు రూ.కోటి నిధులతో గ్రామాభివృద్ధికి మార్గం సుగమమైంది. మొత్తం 656 మంది ఓటర్లున్న మెర్నిపాడు గ్రామ జనాభా వెయ్యి లోపే. మండలానికి మూలగా రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గాన్ని ఆనుకుని ఉన్న ఈ గ్రామాన్ని గత పాలకులు పట్టించుకున్నది లేదు. ఏళ్ల తరబడి వేధిస్తున్న అపరిష్కృత సమస్యలతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సహకారంతో గత రెండేళ్లలో పంచాయతీ సర్పంచ్ గారపాటి సౌజన్య, అశోక్‌కుమార్ దంపతులు దాదాపు రూ.కోటి నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. దీర్ఘకాలంగా గ్రామాన్ని పీడిస్తున్న సమస్యలను పరిష్కరించారు.

బైపాస్ రోడ్డుగా మారిన పుంత రోడ్డు

మండపేట, మండల గ్రామాల నుంచి రాజమహేంద్రవరం వెళ్లే వారు, నర్సరీలకు చెందిన మొక్కల లోడు లారీలతో మెర్నిపాడు రోడ్డులో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుంది. మెయిన్ రోడ్డు ఇరుకుగా ఉండడంతో గ్రామ వెలుపల పుంత రోడ్డు మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. పెద్దపెద్ద గోతులతో ఈ రోడ్డు ప్రమాదభరితంగా ఉండేది. ట్రాఫిక్ అవసరాల దృష్ట్యా 900 మీటర్ల పొడవైన ఈ పుంత రోడ్డును బైపాస్ రోడ్డుగా అభివృద్ధి చేయాలని మూడు దశాబ్దాలుగా గ్రామస్తులు కోరుతున్నారు. ఇందులో 650 మీటర్లు రోడ్డు మెర్నిపాడు పరిధిలోను, 250 మీటర్లు కడియం మండలం జేగురుపాడు పంచాయతీ పరిధిలో ఉంది. రెండు నియోజకవర్గాలకు చెందిన రోడ్డు కావడంతో గత పాలకులు పట్టించు కోలేదు. సర్పంచ్ సౌజన్య దంపతులు ఈ రోడ్డు ప్రాధాన్యతను ఎమ్మెల్సీ తోట దృష్టికి తీసుకురాగా ఆయన స్పందించి మండల పరిషత్ నిధులు రూ.21.5 లక్షలతో బీటీ రోడ్డుగా అభివృద్ధి చేయించారు.

కాలనీ వాసుల వెతలు తీర్చారు

2008లో గ్రామానికి చెందిన సుమారు 60 మంది పేదలకు స్థలాలు పంపిణీ చేయగా వారందరూ గృహాలు నిర్మించుకున్నారు. ఈ ఇందిరమ్మ కాలనీలో రోడ్లు, డ్రైన్లు లేక ప్రజలు దుర్భర జీవనం సాగించేవారు. వసతులు కల్పించాలని ఎంతోమంది నాయకులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయింది. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో కాలనీలో పర్యటించిన ఎమ్మెల్సీ తోటకు సర్పంచ్ సౌజన్య స్థానికుల వెతలు వివరించారు. సచివాలయ నిధులు రూ.20 లక్షలు మంజూరు చేయించి రోడ్లు, డ్రైన్లు నిర్మాణం చేయయించడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రూ.25 లక్షలతో గ్రామ సచివాలయం, ఆర్థిక సంఘం నిధులు రూ.1.6 లక్షలతో ముత్యాలమ్మ ఆలయం వద్ద నుంచి సచివాలయం వరకూ గ్రావెల్‌రోడ్డు, రూ.1.4 లక్షలతో చెరువుకు రక్షణ గోడ, రూ.లక్షతో కాలనీలో వాటర్‌పైప్‌లైన్లు నిర్మించారు. నాడు నేడు పథకం కింద రూ.25 లక్షలతో పాఠశాల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. మునుపెన్నడూ లేని అభివృద్ధి గత రెండేళ్లలో జరిగిందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్సీ తోట సహకారంతో..



ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సహకారంతో రెండేళ్లలో రూ.కోటి నిధులతో ఎన్నో అభివృద్ధి పనులు చేశాం. భవిష్యత్తులో ఎస్సీ కమ్యూనిటీ హాలు ఆధునికీకరణ, బీసీ కమ్యూనిటీ హాలు నిర్మాణాలు పూర్తిచేయడం, ఇందిరమ్మ కాలనీ రోడ్డు వెడల్పు, మెయిన్ రోడ్డులో డ్రైన్ నిర్మాణం, శ్మశానవాటిక అభివృద్ధి తదితర పనులు చేసేందుకు కృషి చేస్తున్నాం.

– గారపాటి సౌజన్య, సర్పంచ్, మెర్నిపాడు

సమన్వయంతో మెరుగైన సేవలు అందించాలి

- ఎమ్మెల్సీ తోట
- వలంటీర్లు, గృహ సారథులకు దిశా నిర్దేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: వలంటీర్లు, గృహ సారథులు సమన్వయంతో పనిచేస్తూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సూచించారు. కేశవరం, ద్వారపూడి, జెడ్ మేడపాడు గ్రామాల్లో కొత్తగా నియమించిన గృహ సారథులకు శనివారం ద్వారపూడిలోని ఫంక్షన్ హాలులో నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్సీ తోట ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వారి బాధ్యతలు, విధులపై ఆయన దిశా నిర్దేశం చేశారు. పార్టీ రాష్ట్రనేతలు కర్రి పాపారాయుడు, రెడ్డి రాజుబాబు, దూలం వెంకన్నబాబు తదితరులు మాట్లాడుతూ గృహసారథులు తమ పరిధిలోని ప్రతీ ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు కుడిపూడి భవాని, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, సర్పంచులు ఈతకోట కిన్నెర, బూరిగ ఆశీర్వాదం, ఉప సర్పంచ్ తులా శేషారావు, ఆర్‌బీకే మండల కమిటీ చైర్మన్ అన్నందేవుల చంద్రరావు, పార్టీ నాయకులు తులా శ్రీరంగారావు, పోతుల రాంబాబు, తోరం శ్రీనివాస్, కొప్పిరెడ్డి ప్రసాద్, తుపాకుల ప్రసన్నకుమార్, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రుద్రయ్య చౌదరి సేవలు ఆదర్శం



విద్యా యశస్వి ది లెజెండ్ పురస్కారాన్ని అందిస్తున్న కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు

రామచంద్రపురం: విద్యాబోధనలో రుద్రయ్యచౌదరి సేవలు ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని ప్రముఖ వైద్యుడు డాక్టర్ చెలికాని స్టాలిన్ అన్నారు. పట్టణంలోని మోడరన్ విద్యాసంస్థల ప్రాంగణంలో జీఆర్‌సీ మెమోరియల్ హాల్‌లో డాక్టర్ గరికపాటి రుద్రయ్యచౌదరి 28వ వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. మోడరన్ విద్యా సంస్థల అధినేత జీవీ రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి డాక్టర్ స్టాలిన్, మున్సిపల్ కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. తొలుత డాక్టర్ రుద్రయ్య చౌదరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ మహనీయులు ఆశయాలకు మరణం ఉండదని యువత తమ కంటూ నైపుణ్యాలను అలవర్చుకుంటే రుద్రయ్యచౌదరికి నిజమైన ఘననివాళి అని వారు పేర్కొన్నారు. మోడరన్ ఫౌండేషన్ తరఫున జీవీ రావు ఆధ్వర్యంలో రుద్రయ్యచౌదరి విద్యా రంగానికి చేసిన సేవలను స్మరిస్తూ ఆయన పేరుమీద ఆయన కుమారుడు జి.వెంకటేశ్వర రావుకు విద్యా యశస్వి ది లెజెండ్ పురస్కారాన్ని కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి చేతుల మీదుగా అందించారు. అనంతరం గరిగిపాటి రుద్రయ్య చౌదరి ఎండోమెంట్ ట్రస్ట్ తరఫున స్థానిక ఏరియా ఆసుపత్రి రోగులకు ఉపయోగార్థం డాక్టర్ స్టాలిన్ చేతుల మీదుగా వీల్ చైర్‌ను ఆసుపత్రి సిబ్బందికి అందించారు. మెరిట్ విద్యార్థులకు నగదు పురస్కారం విద్యావేత్త జాస్తి దుర్గాప్రసాద్ చేతుల మీదుగా ప్రదానం చేశారు. మోడరన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల పి.వెంకటేశ్వర్లు, గరికపాటి సూర్యనారాయణ, వైద్యుడు సీహెచ్ రామారావు, విద్యార్థులు మోడరన్ సిబ్బంది పాల్గొన్నారు.

అద్భుతంగా నిర్మించారని చెప్పను

- వసతుల కల్పనకు కృషి చేస్తా
- టిడ్కో లబ్ధిదారులతో ఎమ్మెల్సీ తోట



టిడ్కో ప్లాట్ల వద్ద స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: టిడ్కో ప్లాట్లు అద్భుతంగా కట్టారని తాను చెప్పనని, అయితే లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా అవసరమైన సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తెలిపారు. టిడ్కో ప్లాట్లపై ఆదివారం ఎమ్మెల్సీ తోట, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావులు బహిరంగ చర్చకు పరస్పరం సవాళ్లు చేసుకున్న విషయం విదితమే. అందుకోసం ఏర్పాట్లపై శనివారం ఆయన పార్టీ రాష్ట్ర నేతలు కర్రి పాపారాయుడు, రెడ్డి రాజుబాబు తదితరులతో కలిసి టిడ్కో గృహాలను సందర్శించారు. ఈ సందర్భంగా ప్లాట్లలో నివాసం ఉంటున్న లబ్ధిదారులు ఎమ్మెల్సీ తోటను కలిసి తమ సమస్యలు వివరించారు. తమ ప్లాట్లలో తాగునీరు, విద్యుత్తు సమస్యలు లేవని మూడు, నాలుగు అంతస్తుల్లో ఉన్న వారు కిందికి రాలేక బాత్‌రూమ్‌లలో దుస్తులు ఉతుక్కోవాల్సి వస్తోందన్నారు. పాముల బెడద ఉందని, వీధిలైట్లు ఉన్నప్పటికీ బ్లాకుల వద్ద లైటింగ్ ఎక్కువగా వచ్చే ఫోకస్ లైట్లు ఏర్పాటు చేయించాలని కోరారు. ట్యాంకర్ ద్వారా సరఫరా చేస్తున్న తాగునీటి లోంచి నాచు వస్తోందని తెలిపారు. సైకిళ్లు, మోటారు సైకిళ్లు ఎండలో ఉండిపోతున్నాయని, షెడ్లు నిర్మించాలని కోరారు.

ఇచ్చిన పట్టాలు లాక్కున్నారు

దివంగత వైఎస్ హయాంలో పేదల సొంతింటి కల సాకారానికి గొల్లపుంత కాలనీలో సెంటున్నర చొప్పున స్థలాలు పంపిణీ చేసిందని ఎమ్మెల్సీ తోట తెలిపారు. మొదటి విడత పట్టాలు పొందిన దాదాపు 1900 మంది లబ్ధిదారులు గృహాలు నిర్మించుకోగా, రెండో విడతలోని లబ్ధిదారుల పట్టాలను గత టీడీపీ ప్రభుత్వం లాక్కుని షీర్‌వాల్ టెక్నాలజీ అంటూ మనిషి తిరిగేందుకు వీలులేని విధంగా ఇరుకు గదులతో టిడ్కో ప్లాట్లు నిర్మాణం చేపట్టి పేదలపై భారం మోపిందని విమర్శించారు. అప్పులు చేసి డిపాజిట్లు చెల్లించిన లబ్ధిదారులు ఇబ్బంది పడకూడదని గత టీడీపీ అసంపూర్తిగా వదిలిపెట్టిన పనులను తమ ప్రభుత్వం పూర్తి చేసి అప్పగిస్తోందన్నారు. ప్రస్తుతం జగనన్న కాలనీలో జరుగుతున్న ఇళ్లకు టిడ్కో ప్లాట్లకు వ్యత్యాసం చూడాలన్నారు. టిడ్కో ప్లాట్లు వద్ద లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్సీ తోట తెలిపారు. దుస్తులు ఉతుక్కునేందుకు వీలుగా ప్రతి బ్లాకు వద్ద చేతిపంపు, ప్లాట్‌ఫాం నిర్మించాలని మున్సిపల్, టిడ్కో అధికారులను ఆదేశించారు. ఓవర్ హెడ్ ట్యాంకు నుంచి క్లోరినేషన్ చేసిన తాగునీరు బ్లాకుల వద్దకు నేరుగా కుళాయిల ద్వారా సరఫరా చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, పాముల బెడద లేకుండా ప్రతి బ్లాకు వద్ద ఫోకస్ లైట్లు ఏర్పాటు చేయాలని, తాగునీటి ట్యాంకర్‌ను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని ఆదేశించారు. 2000 మందికి ప్లాట్లు అప్పగించగా ప్రస్తుతం 950 మంది మాత్రమే వచ్చారని, పూర్తిస్థాయిలో లబ్ధిదారులు వస్తే మరిన్ని అవసరాలు గుర్తించి అందుకు తగిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్సీ తోట తెలిపారు. అనంతరం బహిరంగ చర్చ గూర్చి ఎమ్మెల్సీ తోట మీడియాతో మాట్లాడారు. తొలివిడతగా అప్పగించిన ప్లాట్లలో వసతులు లేక లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారని ఎమ్మెల్యే వేగుళ్ల చేస్తున్న ఆరోపణల పైనా, ప్లాట్లు నిర్మాణంలో జరిగిన అక్రమాలపై తాను బహిరంగ చర్చకు పిలిచిన విషయాన్ని గుర్తు చేశారు. మున్సిపల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, వైఎస్సార్‌సీపీ అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, సయ్యద్ రబ్బానీ, పార్టీ నాయకులు కుడిపూడి రాంబాబు, పలివెల సుధాకర్, యరమాటి వెంకన్నబాబు, దూలం చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

లింక్‌రోడ్డును అభివృద్ధి చేయాలి



గోతులతో అధ్వానంగా మారిన మొగలిపాలెం, శీల లింక్‌రోడ్డు

కాజులూరు: మండలంలోని మొగలిపాలెం, శీల గ్రామాల మధ్య ఉన్న లింక్‌రోడ్డు శిథిలావస్థకు చేరుకుని అధ్వానంగా తయారైంది. కోరంగి కెనాల్ నుంచి శలపాక చానల్ కాలువ గట్టును ఆనుకుని ఉన్న ఈ రోడ్డును పదేళ్ల క్రితం ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో గ్రావెల్ మట్టి వేసి అభివృద్ధి చేశారు. నిర్మాణ సమయంలో నాణ్యత ప్రమాణాల లోపం కారణంగా నిర్మించిన ఏడాది కాలానికే రోడ్డు శిథిలావస్థకు చేరుకుంది. రహదారి మధ్యలో పలు చోట్ల పెద్దపెద్ద గోతులు ఏర్పడడంతో ట్రాక్టర్, ఆటో వంటి వాహనాలతో పాటు సైకిల్, బైక్ వంటి వాహనాలు సైతం ప్రయాణించేందుకు వీలు లేకుండా పోయింది. మండలంలోని శీలలంక, ఒంటితాడి, శీల, మంజేరు గ్రామాల ప్రజలు మొగలిపాలెం మీదుగా గొల్లపాలెం, కాకినాడ చేరుకునేందుకు ఈ లింక్‌రోడ్డు దగ్గర మార్గంగా ఉంటుంది. రోడ్డు పొడవునా నిలువెత్తు గోతుల ఏర్పడి ప్రమాదం భరితంగా మారిందని దీంతో వాహనాల రాకపోకలకు అవకాశం లేకుండా పోతుందని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు గొల్లపుంత కాలనీలో 144 సెక్షన్

మండపేట: స్థానిక గొల్లపుంత కాలనీలో ఆదివారం సెక్షన్ 144 అమలులో ఉంటుందని డీఎస్పీ బాలచంద్రారెడ్డి తెలిపారు. టిడ్కో ప్లాట్లపై అధికార, ప్రతిపక్ష నేతలు ఆదివారం బహిరంగ చర్చకు పిలుపు ఇచ్చుకున్న నేపథ్యంలో పట్టణంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. గొల్లపుంత కాలనీకి 100 మీటర్ల చుట్టుపక్కల సెక్షన్ 144 అమలులో ఉంటుందన్నారు. ఏ పార్టీ నాయకులైనా నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీఐ పెద్దిరెడ్డి శివగణేష్, ఎస్‌ఐ ఎం అశోక్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు రాయితీపై బస్‌పాస్‌ల జారీ



అంగరలో దివ్యాంగునికి బస్‌పాస్ అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

కపిలేశ్వరపురం: మండలంలోని అంగరలో శనివారం దివ్యాంగులకు రాయితీపై బస్ పాస్‌లను జారీ చేశారు. ఆర్టీసీ రావులపాలెం డిపో అధికారుల ఆదేశాల మేరకు అంగర సచివాలయం వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ కార్యదర్శి కామేశ్వరరావు చేతుల మీదుగా ఈ బస్‌పాస్‌లను దివ్యాంగులకు అందజేశారు. కార్యక్రమంలో శిబిరం కో-ఆర్డినేటర్ వీవీపీఎస్‌రాజు మాట్లాడుతూ సంస్థ మంజూరు చేసిన బస్‌పాస్ మూడేళ్ల పాటు వినియోగంలో ఉంటుందన్నారు. దివ్యాంగుడు 50 శాతం రాయితీతో ప్రయాణం చేయవచ్చన్నారు. తాము నిర్వహించే శిబిరంలో దివ్యాంగుడు రూ.100, ఆధార్, సదరం సర్టిఫికెట్ జిరాక్స్, ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు అందజేసిన వెంటనే బస్‌పాస్‌ను జారీ చేస్తామన్నారు. మండలంలోని కాలేరు, వల్లమూరు గ్రామాల్లో సోమవారం శిబిరాలను నిర్వహించనున్నట్టు తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

- హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బాబూరావు
- వెల్లూరు జగనన్న లే–అవుట్ సందర్శన



వెల్లూరు లేఅవుట్‌ను పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ బాబూరావు

రాయవరం: జగనన్న కాలనీల్లో లబ్ధిదారులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ చల్లా బాబూరావు కోరారు. మండలంలోని వెల్లూరు జగనన్న లే–అవుట్‌లో పర్యటించిన అనంతరం సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, గృహ లబ్ధిదారులతో శనివారం ఆయన సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా పీడీ బాబూరావు లబ్ధిదారులకు సిమెంట్, స్టీల్, ఇసుక తదితర నిర్మాణ సామగ్రిని అందజేస్తుందన్నారు. జగనన్న లేఅవుట్లలో లబ్ధిదారులకు విద్యుత్తు, తాగునీరు, డ్రైనేజీ, రహదారులు వంటి మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. హౌసింగ్ ఏఈ కొవ్వూరి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మండలంలో 19 జగనన్న లేఅవుట్లలో 1,651 మందికి ఇంటి స్థలాలు మంజూరు కాగా, ఇప్పటి వరకు 416 మంది ఇళ్ల నిర్మాణం పూర్తిచేసుకున్నారన్నారు. వెల్లూరు లేఅవుట్‌లో 881 మందికి ఇళ్లు మంజూరు కాగా, 163 ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాగా, ఎనిమిది శ్లాబ్, 19 రూఫ్, 216 బేస్‌మెంట్, 462 బిలో బేస్‌మెంట్ దశలో ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో డి.శ్రీనివాసు, తహసీల్దారు కేజే ప్రకాష్‌బాబు, సచివాలయ సిబ్బంది, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కౌమార దశ ఎంతో కీలకం

యానాం: భవిష్యత్‌లో తాము ఏం కావాలనుకుంటున్నారో స్పష్టమైన అవగాహన కౌమార దశలో కలుగుతుందని, ఈ దశ ఎంతో కీలకమని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం స్థానిక కనకాలపేట ఎస్‌కేఎస్‌పీవీఆర్ ప్రభుత్వ హైస్కూల్‌లో అడలోసెంట్ అండ్ కెరీర్ గైడెన్స్ అనే అంశంపై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు పదో తరగతి అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈగల నియంత్రణకు పారిశుధ్య పనులు



శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌ను పరిశీలిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ లావణ్య

మండపేట: పట్టణంలో ఈగలను అరికట్టేందుకు మున్సిపల్ అధికారులు ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి ఆదేశాలు మేరకు మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్ పర్యవేక్షణలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ పి.లావణ్య శనివారం శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పట్టణంలోని అన్ని వార్డుల్లోనూ దోమల మందు స్ప్రేయింగ్ చేయించారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ డ్రైన్లలో చెత్త వేయరాదని, తడి పొడిచెత్తగా విభజించి పారిశుధ్య కార్మికులకు అందజేయాలని కోరారు. సచివాలయ ఉద్యోగులు, శానిటరీ మేస్త్రీలు పాల్గొన్నారు.

యానాం వెంకన్న ఆభరణాలను బహిర్గతం చేయాలి



ఆభరణాల వివరాలు తెలపాలని కోరుతున్న ఎమ్మెల్యే అశోక్ తదితరులు

ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్

యానాం: యానాంలో కొలువైన భూసమేత వేంకటేశ్వరస్వామివారికి పూర్వం నుంచి ఉన్న ఆభరణాల వివరాలను భక్తుల కోరిక మేరకు బహిర్గతం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులపై ఉందని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ అన్నారు. శనివారం యానాం వెంకన్న ఆభరణాలు ఎక్కడున్నాయి, వాటి భద్రత గురించి స్థానిక భక్తులు, వివిధ సంఘాల ప్రజల ఆందోళన నేపథ్యంలో ఆర్ఏఓ చాంబర్‌లో రీజనల్ అడ్మినిస్ట్రేటర్ మునిస్వామి, డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణన్ తదితరులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ మాట్లాడుతూ 600 ఏళ్ల చరిత్ర కలిగిన యానాం వేంకటేశ్వరస్వామికి అనేక ఏళ్లుగా భక్తులు బంగారు, వెండి వస్తువులు, ఆభరణాలను ఇస్తున్నారని, అయితే వివరాలను వెల్లడించకుండా గోప్యత పాటించడం సరికాదన్నారు. ప్రస్తుతం కల్యాణ ఉత్సవ కమిటీని అధికారులే నిర్వహిస్తున్నారు కనుక వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎల్ఏడీ సెక్రటరీ గిడ్డి బలరాం, వందు సిద్ధార్థకుమార్, మాగాపు సుబ్బారావు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా అశ్వవాహనోత్సవం



అశ్వవాహనోత్సవంలో ఎమ్మెల్యే అశోక్, ఆర్ఏఓ మునిస్వామి తదితరులు

యానాం: యానాం భూసమేత వేంకటేశ్వరస్వామివారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఐదో రోజు శనివారం రాత్రి అశ్వవాహనోత్సవం ఘనంగా జరిగింది. పుదుచ్చేరికి చెందిన నల్లం వెంకటరామయ్య ఉత్సవదారులుగా నిర్వహించిన అశ్వవాహనోత్సవంలో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఆర్ఏఓ మునిస్వామి, ఇన్‌చార్జి కమిషనర్ కె.రామకృష్ణ తదితరులు పాల్గొని స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం అశ్వవాహనంపై ఉన్న స్వామివారిని పురవీధుల్లో ఊరేగించారు.